క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో సేదదీరారు. ఉదయం నుంచి ఎండ, ఉక్కబోత తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

మత్స్య సంపద యోజనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ

కొత్తపల్లి: సముద్రంలో వేట నిషేధం జూన్ 14 వరకూ అమలులో ఉంటుందని, వేట నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని అమీనాబాదు తీరప్రాంతంలో మత్స్యకారులకు శనివారం ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మత్స్యశాఖ అధికారి రామకృష్ణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు వినతి



మున్సిపల్ చైర్ పర్సన్‌కు వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్లు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటి వరకూ అంబేడ్కర్ విగ్రహాలు దళిత వాడలకే పరిమితం అవుతున్నాయని, పోలీసు రింగ్ సెంటర్‌లో విగ్రహం ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, మర్రి శేషారావు, పాలిక కుసుమ, ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు లింగం శివ కుమార్ కోరారు. ఈ అంశం మున్సిపల్ అజెండాలోకి వచ్చే విధంగా చూడాలన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కొత్తపల్లి: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఈఓపీఆర్డీ భాస్కరరావు తెలిపారు. మండలంలోని వాకతిప్పలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నామన్నారు. డ్రైన్లలో పూడిక తొలగించి రోడ్లు, వీధులను శుభ్రం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతాలపై దృష్టి సారించామన్నారు. ఉప్పాడ, అమీనాబాదు, మూలపేట, కోనపాపపేట, అమరవిల్లి గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి మే 6వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రతిభకు కృషి తోడైతే విజయం



ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. జేఎన్‌టీయూ కళాశాల క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతిభకు కృషి తోడైతే సాధించలేనిది ఏదీ లేదన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ఎస్పీ బహుమతులు అందించారు. అనంతరం ఎస్పీని సత్కరించారు. రిజిస్ట్రార్ సుమలత, మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌పై గరం గరం

- తొలగించాలని సభ్యుల డిమాండ్
- సామర్లకోటలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు



సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్ పర్సన్, కమిషనర్

సామర్లకోట: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తీరుపై అధికార పక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సామర్లకోట మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. తొలుత అధికారులంతా సమావేశానికి హాజరయ్యారా అని అధికార పక్ష సభ్యుడు పితాని కృష్ణ ప్రశ్నించారు. అందరూ వచ్చారని కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ తెలిపారు. అయితే మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (మున్సిపల్ లాయర్) ఎక్కడా అని పితాని అడిగారు. గత ఆరు సమావేశాల నుంచి స్టాండింగ్ కౌన్సిల్‌ను సభ్యులకు పరిచయం చేయాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, సీనియర్ సభ్యుడు ఆవాల లక్ష్మీనారాయణ కలుగజేసుకుని కౌన్సిల్ అంటే గౌరవం లేని వారు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎందుకని ప్రశ్నించారు. స్టాండింగ్ కౌన్సిల్‌కు నెలకు రూ.15 వేలు చెల్లిస్తుండగా ప్రతి కేసుకు అదనంగా ఫీజు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందని, అటువంటి సంప్రదాయం గతంలో ఎన్నడూ లేదని ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని స్టాండింగ్ కౌన్సిల్‌కు సమాచారం ఇచ్చామని కమిషనర్ తెలిపారు. మెజార్టీ సభ్యుల అభిప్రాయం తీసుకుని ఈ కౌన్సిల్‌ను తొలగించాలని అధికార పక్ష సభ్యులు పట్టుబట్టారు. స్థానిక గణపతినగరంలో ఆర్వో ప్లాంటు మరమ్మతులు చేయడానికి అభ్యంతరం ఏంటని కరణం రాజ్‌కుమార్ ప్రశ్నించారు. నాలుగు రోజుల్లో ఆర్వో ప్లాంటు సిద్ధం చేస్తామని చైర్‌పర్సన్ అరుణ హామీ ఇచ్చారు. 27 నుంచి 31 వరకు ఉన్న ఐదు వార్డుల ప్రజలకు పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపలేదని రాజ్‌కుమార్ అన్నారు.

సమస్యలు చాంబర్‌లో చర్చించాలి

సభ్యులు వారి వార్డుల్లో సమస్యలను చైర్‌పర్సన్ చాంబర్‌లో చర్చించాలని వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ సూచించారు. జీరో అవర్ లేని సమయంలో అజెండాలో అంశాలపై మాత్రమే చర్చించాలన్నారు. ఇటువంటి సమయంలో కౌన్సిల్ సమావేశం ఎందుకని కరణం రాజ్‌కుమార్, పితాని కృష్ణ ప్రశ్నించారు. స్థానిక నీలమ్మ చెరువు వద్ద చర్చి గోడ కూలి ఇద్దరు మృతి చెందిన సంఘటనకు సంబంధించి ఆ చర్చికి అనుమతి ఉందా అని ప్రతిపక్ష సభ్యుడు బలుసు వాసు ప్రశ్నించారు. దీనిపై వైస్ చైర్మన్ మోజెస్ స్పందిస్తూ అది పురాతనమైన చర్చి అని చెప్పారు. టీపీఎస్ ఫణికుమార్ మాట్లాడుతూ పాత భవనాల గోడలు బీటలు వారితే, వాటి నిర్మాణాలు చేసుకునే సమయంలో అనుమతులు అవసరం లేదన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరిగిన ఆదరణ

- ఉలిక్కి పడుతున్న ప్రతిపక్షాలు
- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మెగా పీపుల్స్ సర్వేతో ప్రజల్లో వైఎస్సార్ సీపీకి పెరిగిన ఆదరణ తెలిసిందని, దీంతో ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం పెద్దాపురం పార్టీ క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని 12 రోజుల పాటు పార్టీ నాయకులు, గృహ సారథులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారన్నారు. దీనికి ప్రజల్లో అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది కార్యకర్తలతో సర్వే చేయించామన్నారు. ఇందులో భాగంగా కోటీ 45 లక్షల ఇళ్లకు వెళితే కోటీ 10 లక్షల మంది మిస్ కాల్స్ ఇచ్చారని చెప్పారు. నియోజకవర్గంలో 93,534 గడపలు ఉంటే ఇప్పటి వరకూ 82 వేల ఇళ్లను సందర్శించగా 61 వేల మంది జగన్‌మోహన్‌రెడ్డిని బలపరుస్తూ మిస్ కాల్స్ ఇచ్చారని తెలిపారు. ఇంతటి ఆదరణ లభించడానికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడమే కారణమని చెప్పారు. టీడీపీ అంటే ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. అప్పట్లో జన్మభూమి కమిటీల ద్వారా జరిగిన దోపిడీని మరిచిపోలేమని ప్రతి ఒక్కరూ చెబుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఎగుర వేస్తుందన్నారు. జగనన్నే మా నమ్మకం అనే నినాదం ప్రజల్లోంచి వచ్చిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుంది. అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పార్టీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరుగుతుంది. యజమాని అంగీకారంతో ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లు అతికించారు.



సామర్లకోటలో పథకాలపై ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్

జగనన్నే మా భవిష్యత్తు విజయవంతం

- నియోజకవర్గంలో పీపుల్స్ సర్వేకు అనూహ్య స్పందన
- విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిఠాపురం: నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైందని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. పిఠాపురంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు బాలిపల్లి రాంబాబు, కన్నాబత్తుల కామేశ్వరరావు, అరిగెల రామయ్యదొర, జవ్వాది నాయుడు, దాసం వెంకటేష్, ఉమ్మిడి జాన్, మొగలి సాంబశివరావు తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో 1.45 కోట్ల కుటుంబాలను కలిసి పీపుల్స్ సర్వే నిర్వహించగా 1.10 కోట్ల మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రజలు తమ మద్దతు తెలిపారన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 1.05 లక్షల గృహాలు ఉండగా ఇప్పటి వరకు 80 వేల గృహాలను సందర్శించి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించామన్నారు. ప్రజలు మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రభుత్వానికి తమ మద్దతు తెలిపారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఐదు ప్రశ్నలతో కూడిన ప్రభుత్వ పనితీరును లబ్ధిదారులకు చదివి వినిపించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. తాము వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులమంటూ సీఎం వైఎస్ జగన్ చిత్ర పటంతో కూడిన స్టిక్కర్‌ను వారి ఇంటి గోడలకు అతికించుకుంటున్నారని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా మాకు పథకాలు అందలేదని చెప్పిన వారు కనిపించడం లేదన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

సామర్లకోట: నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన అర్హత పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను మండలానికి పరీక్ష కేంద్రంగా ఎంపిక చేశారు. ఆ కేంద్రంలో 325 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 283 మంది హాజరయ్యారు. 42 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్.కొండారెడ్డి, పరిశీలకుడిగా భాస్కరరావు వ్యవహరించగా పరీక్షలను ఎంఈఓ పరిశీలించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు



నాటికల ప్రదర్శనలకు సిద్ధమైన కళా వేదిక

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం నుంచి మే నెల 2వ తేదీ వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీ కృష్ణ కళా వేదికపై ఈ పోటీలు నిర్వహిస్తామని మార్కండేయ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాటక రంగంలో గుర్తింపు పొందిన కళాకారులు పాల్గొంటారన్నారు . కొత్త పరిమళం, రైతే రాజు, చీకటి పువ్వు, నాన్న నేనొచ్చేస్తా, వెండి అంచులు, గమ్యస్థానాల వైపు, కాపలా తదితర నాటికలు ప్రదర్శిస్తారన్నారు. ప్రజలు ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నవ ధాన్యాల సాగుతో రైతులకు మేలు

పిఠాపురం: వేసవిలో నవధాన్యాల సాగు చేపట్టడం ద్వారా భూసారం పెరిగి మంచి దిగుబడులు వస్తాయని ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అన్నారు. పిఠాపురంలో రైతులకు కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో శనివారం నవ ధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పకృతి వ్యవసాయ సిబ్బంది నవ ధాన్యాల సాగు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం నవధాన్యాల సాగు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వైఎం గణేష్, ఎం.నాగేశ్వరరావు, డివిజనల్ యాంకర్ చంద్ర, ఎం.చినబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు జవ్వాది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ప్రభుత్వ పాఠశాలలు



అచ్చంపేట మండల పరిషత్తు పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. అచ్చంపేటలోని మండల పరిషత్తు పాఠశాల 95వ వార్షికోత్సవానికి శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మాజీ సర్పంచ్ సలాది రమేష్, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వింటి కృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



పదోన్నతి పొందిన పవర హెచ్‌ఎంను సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

సామర్లకోట: పవర హైస్కూల్ హెచ్‌ఎంగా పి.ఉమామహేశ్వరి పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని ఆ గ్రామ ప్రజలు కొనియాడారు. పదోన్నతిపై ఉమామహేశ్వరి బాలికా శిశు అభివృద్ధి అధికారిగా వెళ్తున్న సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి అధ్యక్షతన సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు నాగనబోయిన రాజబాబు, ఉప సర్పంచ్ పిట్టా ప్రభాకర్, మాజీ ఎంపీపీ ఆకునూరి సత్తిబాబు, మాజీ సర్పంచ్ ముచ్చెర్ల కల్యాణ్, విద్యాకమిటీ మాజీ చైర్మన్ భవాని, రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటికకు నిధులు కేటాయించాలి

- అధికారులను కోరిన కౌన్సిలర్లు
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ఎస్సీ శ్మశాన వాటికకు ఇచ్చినట్టుగా ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి అధికారులను కోరారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పుడైనా శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై కమిషనర్ సత్యనారాయణ స్పందిస్తూ గ్రాంటులను పరిశీలించి ముస్లిం శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసరా సదస్సు నిర్వహణకు అయిన ఖర్చుల వివరాలు తెలపాలని పదో వార్డు కౌన్సిలర్ మొగలి దొరబాబు అధికారులను ప్రశ్నించారు. ఏఈ ప్రభాకర్ ఆసరా మీటింగ్‌కు అయిన ఖర్చుల వివరాలను తెలిపారు. సాధారణ సమావేశంలో ఏడు అంశాలు, అత్యవసర సమావేశంలో 11 అంశాలపై చర్చించారు. నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరి సహకారం ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్లు గంధం నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి



జి.రాగంపేటలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ అధికారులు

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తెలిపారు. పెద్దాపురం మండలం జి.రాగంపేటలో శనివారం సాయంత్రం పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులు, వరి కోతల తీరు తెన్నులపై వ్యవసాయ, రెవెన్యూ, సహకార అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కోతలకు సిద్ధపడే వారు మరో రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఆర్‌బీకేల ద్వారా విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర అందిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో వరి ధాన్యం రాశులు, పంటను పరిశీలించారు. కార్యక్రమంలో సహకార శాఖ నుంచి మసకపల్లి శ్రీరంగనాయకులు, తహసీల్దార్ వి.జితేంద్ర, ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన శృంగార వల్లభుని ఆలయం



తిరుపతి శృంగార వల్లభస్వామి



ఆలయ ఆవరణలో భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పేరొందిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే రద్దీ నెలకొంది. గంటల తరబడి భక్తులు క్యూలోనే నిల్చున్నారు. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒకరోజు సుమారు రూ.3.66 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరు కాగా సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

మరిడమ్మ వారికి పూజలు

పెద్దాపురం కోర్టు నూతన జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.సరస్వతి శనివారం మరిడమ్మ వారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సరస్వతి అమ్మవారికి జడ్జి ప్రత్యేక పూజలు చేశారు.

స్వచ్ఛభారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి



షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

పెద్దాపురం: స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి కోరారు. స్థానిక డంపింగ్ యార్డ్ వద్ద స్వచ్ఛభారత్‌లో మంజూరైన పీకల్ షెడ్ నిర్మాణాలకు శనివారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. పుర ప్రజలు తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను విడివిడిగా డస్ట్ బిన్‌లలో ఉంచితే పారిశుధ్య సిబ్బంది వచ్చి వాటిని తీసుకువెళ్తారన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చేపట్టే ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛ పెద్దాపురానికి ప్రజలు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయండి



పవరలో నాడు-నేడు పనులపై వివరాలు సేకరిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

సామర్లకోట: పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి సూచించారు. శనివారం పవర జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో నాడు-నేడు పనులపై ఆయన ఆరా తీశారు. పనులు ప్రారంభించక పోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉన్న హెచ్‌ఎం పదోన్నతిపై బదిలీ కావడం, ఇన్‌చార్జి హెచ్‌ఎంకు చెక్ పవర్ రావడంలో జాప్యం కారణంగా పనులు ప్రారంభించలేదని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులకు రూ.39 లక్షలు మంజూరైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణ తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల ప్రగతికి బాటలు వేస్తుందని డీఎల్‌డీఓ అన్నారు. జిల్లా వ్యాప్తంగా నాణ్యతతో వేగంగా పనులు పూర్తి చేసిన పాఠశాలలకు అవార్డులు ఇచ్చే ప్రతిపాదన ఉందని, దీనిని ఆయా హెచ్‌ఎంలు, విద్యా కమిటీ సభ్యులు గమనించాలన్నారు. పనులకు సంబంధించి సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు అడపా ఆదినారాయణ, వీవీ సత్యనారాయణ, ఎల్.సత్యనారాయణ, ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోండి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఈఓ సత్యనారాయణ

పెద్దాపురం: యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో శనివారం డిగ్రీ సెమిస్టర్ ఆరు నెలల ఉద్యోగ శిక్షణలో భాగంగా నెల్లూరు శ్రీసిటీ ఇసుజు కంపెనీ ఇంటర్న్‌షిప్ చేసేందుకు 44 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన అభినందన సభకు సీఈఓ సత్యనారాయణ, డీఆర్‌ఓ శ్రీధర్‌రెడ్డి, వికాస పీడీ లచ్చారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ శిక్షణా కాలంలో ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.12 వేల శిక్షణాభృతి ఇస్తామన్నారు. శిక్షణలో మరిన్ని అంశాలపై అవగాహన కల్పించుకుని యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం శిక్షణకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్లేస్‌మెంట్ అధికారి తాతాజీ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

సామర్లకోట: మండలంలోని కెనాల్ రోడ్డులో శనివారం పెను ప్రమాదం తప్పింది. బిక్కవోలు నుంచి వస్తున్న లారీ వేట్లపాలెం వద్దకు వచ్చేసరికి డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దాంతో వెనుక వస్తున్న స్కూల్ బస్సు లారీని ఢీకొంది. దాని వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు స్కూల్ బస్సును ఢీకొంది. దీంతో స్కూల్ బస్సులోని విద్యార్థులకు, ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విమర్శలు వచ్చాయి.